సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని వేలాది మంది తరలివచ్చారు. వేకువజాము నుంచి రద్దీ కనిపించింది.



ప్రేమ పెళ్లికి సహకరించాడని..

ప్రేమ పెళ్లికి సహకరించాడనే నెపంతో ఓ వ్యక్తి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో చోటుచేసుకుంది. 8లో ▸



కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు నినదించారు. తాడేపల్లిగూడెం, నూజివీడులో నిరసనలు తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

భీమవరం కమిషనర్‌గా రామచంద్రరెడ్డి



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా కె.రామచంద్రరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై భీమవరం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా చేసిన శ్యామల పీఆర్‌అండ్‌ఆర్‌డీ శాఖకు బదిలీ అయ్యారు. కమిషనర్ రామచంద్రరెడ్డి కలెక్టర్ నాగరాణిను మర్యాదపూర్వకంగా కలిశారు.

27 నుంచి ఎసెస్‌మెంట్ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 27 నుంచి సెల్ఫ్ ఎసెస్‌మెంట్ మోడల్ పేపర్–1 పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. 27న ఓఎస్ ఎస్‌సీ కోర్సుల విద్యార్థులకు, 28న తెలుగు, ఉర్దూ, 30న ఇంగ్లిష్, 31న గణితం, 2న పీఎస్, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

తెలుగు తమ్ముళ్లకే ఉపాధి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరయ్యే నిధులతో పల్లెల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తుంటారు. పనుల్లో అత్యధిక శాతం ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పని దినాలు లభించేలా అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం రూటు మార్చి హడావుడిగా వందల కోట్లు ఖర్చు చేస్తున్నాం అంటూ వారం రోజుల నుంచి ఊదరగొట్టింది. అన్ని పంచాయతీల్లో మొక్కుబడిగా గ్రామ సభలు నిర్వహించి తూతూమంత్రంగా పనులన్నీ ఆమోదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో రూ.223 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.74 కోట్లతో ఉపాధి హామీ పనులు నిర్వహించనున్నారు. అధిక శాతం పనులు యంత్రాలతోనే నిర్వహించి తెలుగు తమ్ముళ్లు జేబులు నింపుకోవడానికి కొత్తగా అవకాశాలు సృష్టిస్తున్నారు.

కూలీలకు శరాఘాతం

జిల్లాలో దశాబ్దాలుగా జాతీయ ఉపాధి హామీ పథకం అమలువుతుంది. 90 శాతం కేంద్రం నిధులతో పనులు చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో అత్యధికంగా రూ.330 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది మాత్రం అట్టహాసంగా రూ.223 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించి 475 గ్రామ సభల్లో తీర్మానాలు చేశారు. అయితే 70 శాతానికిపైగా పనులు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లకే కేటాయించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి. 408 గ్రామాల్లో సభలు నిర్వహించి రూ.74.84 కోట్లతో 432 పనులకు ఆమోదం తెలిపారు. వీటిలో కూడా 80 శాతానికిపైగా రోడ్డు నిర్మాణ పనులు ఉన్నాయి. మొత్తంగా 49 రకాల పనులు మాత్రమే సభల్లో పెట్టి ఆమోదం పొందాలని ప్రభుత్వం సూచించింది. దీనిలో వ్యవసాయ అనుబంధ, నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, వ్యక్తిగత లబ్ధి చేకూర్చే ఇలా నాలుగు కేటగిరీల్లో పనులు విభజించారు. ఈ క్రమంలో చెరువుల తవ్వకాలు మొదలు పొలంగట్లపై మొక్కలు నాటడం, వ్యక్తిగత పనుల కేటగిరీలో షెడ్ల నిర్మాణం నుంచి నీటికుంటల ఏర్పాటు వరకు ఉన్నాయి. అయితే తెలుగు తమ్ముళ్ల లబ్ధి కోసం 70 శాతానికిపైగా పనులు మౌలిక సదుపాయాల పేరుతో రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించడం ఉపాధి హామీ కూలీలకు శరఘాతంగా మారనుంది.

కూలీలకు లేదు హామీ

- నిధులన్నీ అభివృద్ధి, వ్యక్తిగత పనులకే కేటాయింపు
- ఏలూరు జిల్లాలో రూ.223 కోట్లు
- 'పశ్చిమ'లో రూ.74.84 కోట్లతో పనులు
- తూతూమంత్రంగా గ్రామసభల్లో ఆమోదం
- ఉపాధి హామీ కూలీలకు దక్కని న్యాయం
- యంత్రాలతో నిర్వహించే పనులే అత్యధికం



30 పని దినాలు కూడా అనుమానమే..

తెలుగు తమ్ముళ్ల ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపాధి **హామీ కూలీల పనిదినాలపై ప్రభుత్వం కత్తికట్టింది. ఏటా జిల్లాలో సగటున 45 రోజుల పనిదినాలు ఉండేవి.** ఈసారి 30 రోజులు పనిదినాలు కూడా దక్కడం పూర్తిగా అనుమానమే. ఏలూరు జిల్లాకు కేటాయించిన రూ.223 కోట్ల బడ్జెట్‌లో సింహభాగం కాంపొనెంట్ పనులకే ఖర్చు చేయనున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పనిదినాలు కూలీలకు అందించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో గతేడాది 1.38 కోట్ల పనిదినాలు కల్పించారు. అలాగే జిల్లాలో 6 లక్షల జాబ్‌కార్డులకు గాను 3.54 లక్షల కార్డులు యాక్టీవ్‌గా ఉన్నాయి. చెరువు పూడికతీత, గట్ల నిర్మాణం, ఫీడర్ కాల్వ తవ్వకాలు, వ్యవసాయ భూముల్లో బావుల నిర్మాణం, నీటికందకాలు, పశువుల చెరువుల నిర్మాణం ఇలాంటి పనులకు గతంలో ఎక్కువగా కేటాయించడంతో ఉపాధి హామీ కూలీలకు న్యాయం జరిగేది. ఈసారి పూర్తిగా యంత్రాలను ఉపయోగించి నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయిన్ పనుల వల్ల ఉపాధి కూలీలకు నష్టం వాటిల్లనుంది. అలాగే పూర్తిస్థాయిలో కేంద్రం నిధులు కావడం, బిల్లులకు ఇబ్బందులు ఉండకపోవడంతో మెజార్టీ పనులు సీసీ రోడ్లకే కేటాయించి పనులన్నింటినీ తెలుగు తమ్ముళ్లకే అప్పగించారు.



భద్రతా చర్యలు చేపట్టాలి



స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా మహిళలకు రక్షణ లేకపోవడం దారుణం. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన లాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలి. ఈ కేసును సీబీఐ సుమోటోగా స్వీకరించడం మంచి పరిణామం. త్వరితగతిన దోషులను కఠినంగా శిక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్‌సుప్రియ, నరసాపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

దాడులు అమానవీయం



ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు నిలిపే వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడటం చాలా ఘోరం. ఆస్పత్రుల్లోని భద్రతా వైఫల్యాలను ఈ ఘాతుకం తేటతెల్లం చేస్తుంది. ఇటువంటి ఘటనలు మరలా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ కల్పించే చట్టాన్ని వెంటనే అమలులోకి తీసుకురావాలి.

– డాక్టర్ మావూరి మాధురి, ఎల్‌బీచర్ల పీహెచ్‌సీ

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఏలూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను స్థాయి సంఘాల యందు ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు సరికాదు



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు

ఉండి: ప్రభుత్వ ఉత్తర్వులు తమను తీవ్రంగా అవమానపరచినట్లు ఉన్నాయని, ఒకరు వద్దన్న పనిని తమపై రుద్దడం సరికాదని మండలంలోని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఫొటోలు తీసి పంపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేయాలంటూ శనివారం ఎంఈఓ వినాయకుడుకి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు వారికి అవమానంగా భావించి వద్దన్న పనిని వెల్ఫేర్ అసిస్టెంట్లు చేయాలని ఆదేశించడం వివక్షాపూరితంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలలో ఊడిపడిన రేకులు



అర్ధమూరు పాఠశాలపై ఊడిపడిన రేకులు

ఉండి: అర్ధమూరులోని సీబీ సీఎన్‌సీ పాఠశాల భవనంపై నుంచి శనివారం రేకులు ఊడిపడటంతో విద్యార్థులు భయాందోళన చెందారు. ఒక విద్యార్థికి స్వల్పగాయం కాగా మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా ఎవరికీ ఏమీ కాకపోవడం అదృష్టమని సర్పంచ్ వీర్రాజు, ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. విషయం తెలిసిన ఎంఈఓలు బి.జ్యోతి, వినాయకుడు హుటాహుటిన పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. స్కూల్ భవనాన్ని తొలగించి పంచాయతీ మంజూరు చేసిన స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కోరారు.

14న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ వెల్లడించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏలూరు డివిజన్‌కి సంబంధించిన కేసుల విచారణకు సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ బీవీ కృష్ణారెడ్డి, జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి



సమీక్షిస్తున్న చీఫ్ ఇంజనీర్ వీరేశ్వర ప్రసాద్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఫేజ్–1లో ఇళ్ల నిర్మాణ ప్రగతి, నిర్మాణం పూర్తయిన ఇళ్లపై గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ జి.వీరేశ్వర ప్రసాద్ సమీక్షించారు. అక్టోబర్ ముగిసేసరికి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, జిల్లాలో నిర్మాణం, శ్లాబ్ పూర్తయిన ఇళ్లు, గోడల నిర్మాణం పూర్తయిన ఇళ్లను పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేవుట్, సొంత స్థలంలో లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో రూఫ్ లెవెల్, రూఫ్, శ్లాబ్ దశల్లో ఉన్న మొత్తం 3,561 ఇళ్లను వేగంగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ నమూనా ప్రకారం అంచనా విలువ తయారు చేసి లబ్ధిదారులతో తక్కువ నిర్మాణ వ్యయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేయించాలన్నారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పిచ్చియ్య, డివిజన్ హెడ్ హౌసింగ్ బీవీ రమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం


పిట్టా శాంతి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్

నరసాపురం : వైఎన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పిట్టా శాంతిని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ 2024 సంవత్సరానికి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం గుంటూరులో జరిగే కార్యక్రమంలో అవార్డు ఇవ్వనున్నారు. ఈ ఆర్గనైజేషన్ ఏటా ప్రతిభావంతులైన అధ్యాపకులను గుర్తించి అవార్డు అందిస్తోంది. పిట్టా శాంతి ఎంపిక కావడంపై కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ తదితరులు అభినందనలు చెప్పారు.

ఈవీఎంల గోదాం తనిఖీ


ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎలక్టోరల్ అధికారి కె.విశ్వేశ్వరరావు, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ ఎలక్టోరల్ అధికారి (వెలగపూడి) కె.విశ్వేశ్వరరావు, కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల రక్షణ, భద్రతను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, లాగ్ బుక్, గోదాం లాక్‌ను పరిశీలించారు.

శతాధిక వృద్ధుడి మృతి


తోట ముసలయ్య

గణపవరం : గణపవరానికి చెందిన శతాధిక వృద్ధుడు తోట ముసలయ్య(102) శనివారం మరణించారు. వందేళ్లు దాటినా ఆయన చనిపోయేవరకూ ఆరోగ్యంగానే ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. సుగర్, బీపీ వంటి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్నారు. ఆయన కుమారుడు తోట సింహాద్రి అప్పారావు నిడమర్రు మండలం తోకలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపై విచారణ

తణుకు: తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి వ్యవహారంపై విచారణ చేపట్టారు. కార్యాలయంలో పని చేస్తున్న అధికారితోపాటు మరో ఇద్దరిపై ఆరోపణల నేపథ్యంలో విచారణ చేస్తున్నారు. కార్యాలయంలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులను నియమించుకుని వారితో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఇటీవల పలువురు కక్షిదారులు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల మంజూరు విషయంలో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు, ఈసీలు, నకళ్లకు సంబంధించి రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కృష్ణంరాజును వివరణ కోరగా గతంలో కార్యాలయంలో కంప్యూటర్ పని చేసిన ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులను తొలగించినట్లు చెప్పారు.



ప్రత్యేక చట్టం తేవాలి



కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో పీజీ వైద్యురాలిపై హత్యాచారం శోచనీయం. సమాజంలో ఇలాంటి ఘటనలతో వైద్యుల మానసిక స్థైర్యం దెబ్బతింటోంది. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేస్తోన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రత్యేకంగా చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి. అప్పుడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయి.
– డాక్టర్ ఏవీఆర్ మోహన్, సీనియర్ వైద్య నిపుణుడు

దేశవ్యాప్తంగా మార్పు రావాలి



కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన ఘటన అత్యంత దారుణం. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలంటే దేశ వ్యాప్తంగా చట్టాల్లో, ప్రజల్లో మార్పురావాలి. వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ ఉండేలా అవుట్‌పోస్టులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా మహిళా సిబ్బందికి పూర్తి రక్షణ అవసరం. పోలీసులు నిరంతరం తమకు అందుబాటులో ఉంటే రక్షణగా ఉంటుంది.
– డాక్టర్ ప్రియదర్శిని, దెందులూరు సీహెచ్‌సీ

అభయ హంతకులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన అభయ హంతకులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాల మహిళా రక్షణ విభాగం, జాతీయ సేవా పథకం యూనిట్ విద్యార్థులు పట్టణంలో శనివారం మహా ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న అఘాయిత్యాలను లఘునాటికల రూపంలో ప్రదర్శించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ డి.ఆర్.సలోమి సునీత, ప్రొఫెసర్ పి.రమాదేవి, డాక్టర్ ఆర్‌వీ.సుజాత, అసోసియేట్ ప్రొఫెసర్ యు.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ర్యాలీ

నూజివీడు: కోల్‌కతా ఘటనలో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శనివారం ట్రిపుల్ ఐటీ నుంచి పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డైరెక్టర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతికంగా, అభివృద్ధిలో ముందుకు వెళ్తున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం అనాగరికమన్నారు. రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ బీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో లఘు నాటిక ప్రదర్శిస్తున్న ఉద్యాన వర్సిటీ విద్యార్థినులు



నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

అపుస్మా కార్యవర్గాల ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక లిటిల్ వరల్డ్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఏలూరు నియోజకవర్గం గౌరవాధ్యక్షుడిగా మార్గాని నాగ శ్రీకాంత్(ఎస్‌కే స్కూల్), అధ్యక్షుడిగా కొసరాజు వెంకటేశ్వరరావు(హోప్ స్కూల్), సెక్రటరీగా సతీష్ కుమార్(బ్రైట్ స్కూల్), కోశాధికారిగా శేఖర్(సన్‌షైన్ స్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దెందులూరు నియోజకవర్గం గౌరవాధ్యక్షుడిగా చుక్కా అవినాష్ రాజు(ఎస్ఎంసీస్కూల్) అధ్యక్షుడిగా ఎస్ఎస్ రాజు(మమత స్కూల్), సెక్రటరీగా తంబి(శారదాంబికా స్కూల్), కోశాధికారి జయరాజు(సుష్మా స్కూల్)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని నాగ శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు గున్నం బుల్లెబ్బాయ్, అన్నపనేని రవికుమార్, జిల్లా సెక్రటరీ శివ కుమార్, జిల్లా కోశాధికారి రవి శంకర్, ఏలూరు నాయకులు పాల్గొన్నారు.


అపుస్మా నాయకులను అభినందిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం: భీమవరం పట్టణంలోని అంగర విజయలక్ష్మి–కన్నయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మెంటే సుబ్బారావు–నాగరత్నం మెమోరియల్ స్టేట్ సబ్ జూనియర్ అండర్–17 బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం పోటీల్లో అండర్–17 బాయ్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో కె. యువతేజ్‌పై కె.శ్రీకర్ వెంకటప్రణీత్ విజయం సాధించగా, కుర్ర నాగచైతన్యపై టి.లక్ష్మీస్వేతాన్, వి.తారక్ పై వి.హరికృష్ణ, కె.సాయిపై చరణ్ రామ్ విజయం సాధించారు. అండర్ –17 బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో సరయుపై వైష్ణవి, ఆర్.యశ్విత్‌పై రాంగోమి, రెడ్డి వైష్ణవిపై రేణుశ్రీ శ్యామలరావు విజయం సాధించారు


భీమవరంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీల దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పెదపాడు మండలంలోని తాళ్లమూడిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సత్యవోలు గ్రామానికి చెందిన కోటప్రోలు ఉమామహేశ్వరరావు, భార్య వెంకట మహాలక్ష్మి(60) శనివారం హనుమాన్ జంక్షన్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో మహాలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా భర్త ఉమామహేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో సంబంధిత అధికారులు శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్యం, తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత నాలుగు నెలల్లో 26 మంది నవజాత శిశువులు మరణించడం చాలా బాధాకరం అన్నారు. నవజాత శిశు మరణాలు గణనీయంగా తగ్గాలని సూచించారు. ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువ జ్వరం కేసులు నమోదు అవుతున్నాయని, ఇంటింటా ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. గతేడాది డెంగ్యూ కేసులు వచ్చిన ప్రాంతాలలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తాడేపల్లిగూడెం తణుకులో ఎలిసా టెస్ట్ అందుబాటులో ఉందని, డెంగ్యూ కేసులు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం చేయాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏఈలు, ఈవోపీఆర్డీలు కృషిచేయాలన్నారు. తాగునీటి పైప్ లైన్ లో డ్రైనేజీ వాటర్ కలవకుండా లీకులను గుర్తించి వెంటనే అరికట్టాలని ఆదేశించారు. క్లోరినేషన్ పక్కాగా జరగాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పశుగణన

భీమవరం(ప్రకాశం చౌక్): అఖిల భారత పశుగణన సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు జరగనున్న నేపథ్యంలో పశుగణనకు సంబంధించిన గోడపత్రికను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నాగరాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుగణన పక్కాగా నిర్వహించాలన్నారు. పశు సంవర్ధక అధికారి డా. కె.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 5,25,204 గడపలు ఉండగా పశు సంవర్ధకశాఖ సిబ్బంది గడప గడపకు సర్వే నిర్వహిస్తారన్నారు.

ప్రేమ పెళ్లికి సహకరించాడని దాడి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రేమ పెళ్లికి సహకరించాడనే నెపంతో ఒక వ్యక్తి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో శనివారం జరిగింది. జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేటకు ఆళ్ల గణేష్, పారేపల్లి జాహ్నవిలు ప్రేమించుకున్నారు. వీరు 4 రోజుల క్రితం వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని గణేష్‌కి బావ వరుసయిన మందపాటి రాజు మధ్యవర్తిగా వ్యవహరించి చేశాడన్న అనుమానంతో శనివారం రాజుపై అమ్మాయి బంధువులు దాడికి పాల్పడ్డారు. దీంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడిలో గాయపడిన రాజు, అతని కుటుంబ సభ్యులను పోలీసులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ దాడి ఘటనతో మనస్తాపానికి గురైన గణేష్, జాహ్నవిలు పురుగు మందు డబ్బా చేతితో పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నామంటూ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు. వీరిద్దరూ ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ వీరిద్దరూ మేజర్లు అయినందున వీరి జోలికి వెళ్లి ఇబ్బందులకు గురిచేయవద్దని ఇరు కుటుంబసభ్యులకు సూచించామని డీఎస్పీ తెలిపారు. వీరు ప్రభుత్వ ఆస్పత్రిలో క్షేమంగా ఉన్నారని, వైద్యులతో మాట్లాడినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.


ప్రేమజంటకు సహకరించాడంటూ రాజుపై దాడి


ఆత్మహత్యకు పాల్పడుతున్నామంటూ వీడియో పోస్టు చేసిన గణేష్, జాహ్నవి

కొడుకుపై తండ్రి, బంధువుల దాడి

ద్వారకాతిరుమల: పొలం ఇవ్వమని అడిగిన కొడుకుపై తండ్రి, బంధువులు దాడి చేసిన ఘటన మండలంలోని కోడిగూడెంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొవులూరి కాంతయ్యకు 4 ఎకరాల పొలం ఉంది. ఆ పొలాన్ని 18 ఏళ్లుగా ఆయనే సాగు చేసుకుంటూ, ఫలసాయాన్ని కుమారుడు ధర్మారావుకు ఇవ్వకుండా, కుమార్తెలకు ఇస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారావు తాను అప్పుల్లో ఉన్నానని, ఒక ఎకరం పొలం ఇవ్వమని అడిగాడు. దాంతో కాంతయ్య జంగారెడ్డిగూడెం మండలం నిమ్మలగూడెంలో, అలాగే లక్కవరంలో ఉంటున్న కుమార్తెలు, అల్లుళ్లకు ఫోన్ చేసి పిలిపించాడు. ధర్మారావును చంపేస్తే పొలం ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదన్న ఉద్దేశంతో కాంతయ్య, అతని అల్లుళ్లు దాసరి గంగరాజు, బంటుమిల్లి డేవిడ్ రాజు, మనుమలు దాసరి వంశీ, దాసరి సుందర్‌బాబులు ధర్మారావు ఇంటికి వెళ్లి కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాల పాలైన ధర్మారావును అతని భార్య, చుట్టుపక్కలవారు హుటాహుటీన 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కాంతయ్య, వంశీ, గంగరాజు, డేవిడ్‌రాజు, సుందర్‌బాబుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

స్వర్ణాంధ్రలో గ్రాడ్యుయేషన్ డే

నరసాపురం రూరల్: సాంకేతిక విద్యను అభ్యసిస్తే మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ అన్నారు. శనివారం నరసాపురం మండల పరిధిలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యా శాఖ సభ్యుడు సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రణాళిక ప్రకారం భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కళాశాల కోశాధికారి కొండవీటి వెంకటేశ్వరస్వామి (త్రినాథ్), పాలక వర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలతోపాటు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతిని అందజేశారు.


పట్టాలు అందుకున్న విద్యార్థులు, హాజరైన అతిథులు, స్వర్ణాంధ్ర సిబ్బంది

అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మహిళలు, యువతులు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పలువురు మహిళా వైద్యులు సూచించారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో శనివారం మహిళలపై హింస నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలపై హత్యాచారాలు పెచ్చుమీరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుని యువతులు, మహిళలు తమను తాము రక్షించుకోవాలన్నారు. ప్రతివారు తమ మొబైల్‌లో హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆడపిల్లలు తమ మొబైల్ ఫోన్‌లో మహిళల రక్షణకు ఉద్దేశించిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మలాదేవి బాచోటి, డాక్టర్ చిత్ర మైనేని, డాక్టర్ రోషిణి గుండపనేని పాల్గొనగా కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ జీ సరళ పర్యవేక్షించారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళా వైద్యులు

ఉపాధి పనులు చట్టబద్ధంగా జరగాలి

ఉండి: జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఉపాధి హామీ పథకం పనులన్నీ చట్టబద్ధంగా జరగాలని ఆ శాఖ పీడీ ఎం.ప్రభాకరరావు అన్నారు. శనివారం ఉండి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డు అసిస్టెంట్ల నుంచి రూ.73,584 రికవరీ చేసినట్లు తెలిపారు. రూ.9 వేలు జరిమానా విధించగా రూ.20 వేలు సరిచేసుకోవాలని సూచించారు. ఉణుదుర్రు, మహదేవపట్నం గ్రామాలకు చెందిన ఎన్ఆర్ఈజీఎస్ పనులలో రూ.1.48 లక్షలు విలువైన పనులపై ఎంక్వయిరీ వేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2023–24 సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 1240 పనులు నిర్వహించగా వాటికి రూ.5.07 కోట్లు నగదు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఆర్‌జీలో సమాన హక్కుల దినోత్సవం

పెంటపాడు: మండలంలోని డిఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళల సమాన హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక సదస్సులో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, గూడెం బార్ అసోషియేషన్ నాయకులు శివరామకృష్ణలు మట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలపై వివరించారు. విద్యార్థులకు హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వి. కుసుమకుమారి, ఎం. ఇందిరమ్మ, జె. విజయబాబు, రచయిత సుంకర గోపాల్, లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కొత్తూరు విలేజ్ హెల్త్ క్లినిక్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే.శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని కొత్తూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మహిళ చట్టాలు, లైంగిక వేధింపులు నివారణ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు వర్తించే వివిధ రకాల పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎస్‌ఎం విజయశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.ముత్యాలు, సునీత, ఆశా కార్యకర్తలు పి.వెంకటలక్ష్మి, కే.రామసీత తదితరులు పాల్గొన్నారు.

గేదెల అపహరణ కేసులో ముగ్గురి అరెస్టు

తణుకు: తణుకు మండలం వేల్పూరు గ్రామంలో గేదెలు అపహరణకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల మారుతి అయ్యన్నరావు తనకు చెందిన డైరీఫామ్‌లో రెండు గేదెలు అపహరణకు గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు వీరభద్రపురంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్న బండి రామలింగేశ్వరరావు అలియాస్ ఈశ్వరరావు, దువ్వ గ్రామానికి చెందిన కోసూరి సతీష్, వీరభద్రపురం గ్రామానికి చెందిన దున్నా సోమరాజులను శుక్రవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే ఇటీవలి కాలంలో తణుకు మండలం వేల్పూరు పరిసర ప్రాంతాల్లో పలు గేదెలు అపహరణకు గురయ్యాయని పేర్కొంటూ రైతులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

నాగమల్లయ్య సేవలు అభినందనీయం

పెంటపాడు: అంకిత భావంతో రెండు పర్యాయాలు స్కూల్ కమిటీ చైర్మన్‌గా సేవలందించిన నిల్లా నాగమల్లయ్య సేవలు అభినందనీయమని ఎంఈవో-2ల సంఘ రాష్ట్ర కన్వీనర్ టీవీ రామకృష్ణ పేర్కొన్నారు. మీనవిల్లూరు ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు నిధుల ఖర్చు విషయంలో స్కూల్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, రెండు పర్యాయాలు ఎక్కువమంది విద్యార్థులు స్కూల్లో చేరేలా కృషి చేసిన స్కూలు విద్యాకమిటీ చైర్మన్ నాగమల్లయ్య ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో మల్లయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం రవీంద్ర, విజయకుమార్, పంపన ఏడుకొండలు, కొండ్రెడ్డి సత్యనారాయణ, కరిమజ్జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి

తణుకు టౌన్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కే ఆనంద్ చెప్పారు. శనివారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగాలన్నారు. సమయ పాలన, క్రమశిక్షణలతో మంచి భవిష్యత్‌ను పొందవచ్చని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినీలు చదువుతో పాటు మంచి సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నందిగం సుధాకర్, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, ఎస్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీవీ సత్యనారాయణరెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



రక్షణ కల్పించాలి



తాడేపల్లిగూడెం అర్బన్: రోగుల ప్రాణాలు కాపాడాలనే సదుద్దేశంతో సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందికి దాడుల నుంచి రక్షణ కల్పించాలి. అందుకు ప్రత్యేక ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి. దీనికి సామాజిక అవగాహన అవసరం. వైద్య వృత్తిలో రోగి ప్రాణం పోయేలా ఎవరూ వ్యవహరించరు. అనివార్య పరిస్థితుల్లో రోగులు మరణిస్తే దాడులకు తెగబడటం సమంజసం కాదు. ఈ తరహా దాడులకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలి. – నీలగిరి వరలక్ష్మి, హౌసింగ్‌బోర్డు, తాడేపల్లిగూడెం.

ప్రత్యేక చట్టం తేవాలి



వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందజేస్తున్న వైద్య సిబ్బందికి ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలి కోల్‌కతా దోషులను శిక్షించే విధానం భవిష్యత్తులో మహిళలపై దాడి చేయాలంటే వణుకు పుట్టేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. – బోణం విజయనిర్మల, కొబ్బరితోట, తాడేపల్లిగూడెం.

రికార్డులు భద్రమేనా ?

- శిథిలావస్థకు చేరిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం
- తణుకులో 160 ఏళ్ల కాలం నాటి భవనం
- మదనపల్లె ఘటనతో అప్రమత్తమైన యంత్రాంగం



తణుకులో 160 ఏళ్లనాటి భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలమైన భవనంలోనే రికార్డులు (ఫైల్)



కార్యాలయంలో సైతం బరకాల ఏర్పాటు

తణుకు: ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతుల భూములకు సంబంధించిన వివరాలు ఉన్న గదిలో దాచిన రికార్డులు కాలిపోయాయి. ముఖ్యంగా భూసేకరణ, ఆస్తిపత్రాలు, విలువైన రికార్డులు కాలిపోయాయి. ఈ ఘటన అనంతరం ఫైర్, విద్యుత్ శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితులను పరిశీలించి నివేదిక అందజేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో ప్రజల ఆస్తిపత్రాలు ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులు ఇటీవల తణుకులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేశారు.

1864 నాటి భవనం..

తణుకులోని కోర్టు సముదాయాల ప్రాంగణంలో 1864వ సంవత్సరంలో నిర్మించిన భవనంలోనే ప్రస్తుతం రికార్డులను ఉంచారు. అక్కడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రికార్డు రూమ్ ఉండేవి. 2007లో ప్రత్యేకంగా సజ్జాపురం కార్యాలయంగా విభజించి మరోచోట అద్దె భవనంలో ఏర్పాటు చేయడంతో సుమారు 40 గ్రామాలకు సంబంధించిన రికార్డులు అక్కడికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 160 ఏళ్లనాటి భవనంలో తణుకుతో పాటు తణుకు మండలంలో ఆరు, ఉండ్రాజవరం మండలంలోని ఏడు గ్రామాలకు సంబంధించిన రికార్డులు ఉన్నాయి. అయితే ఈ భవనం పెచ్చులూడి శిథిలావస్థకు చేరడంతో రికార్డుల భద్రతపై ఆందోళన నెలకొంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కార్యాలయం పైకప్పుపై బరకాలు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. కార్యాలయంలో సైతం పెచ్చులు ఊడిపోకుండా బరకాలు ఏర్పాటు చేయడం విశేషం.

మొత్తం 1867 వ్యాల్యూమ్స్...

భూతగాదాలు, ఆస్తి పంపకాల వివరాలు, తాతల కాలం నాటి వీలునామాలు దొరక్కపోతే తణుకు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిందే. 1993 నుంచి ఈసీ, సీసీల వివరాలు ఆన్‌లైన్ చేశారు. అప్పుడు చేతిరాత, దస్తావేజుల దస్తూరితో వ్యాల్యూమ్ వివరాలు ఉండేవి. కొత్తగా వచ్చిన ఉద్యోగుల్లో చాలామందికి వాటిని చదవడం కూడా రాదు. తణుకు, తణుకు వేమవరం, వెంకట్రాయపురం, కొమరవరం, వేల్పూరు, వీరభభద్రపురం గ్రామాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాలోని చిలకంపాడు, కె.సావరం, మోర్త, పాలంగి, తాడిపర్రు, వెలగదుర్రు, ఉండ్రాజవరం గ్రామాలకు సంబంధించి ఆస్తిపత్రాల వివరాలు 1867 వ్యాల్యూమ్స్ ఇక్కడ ఉన్నాయి.

ప్రమాదంలో కార్యాలయాలు..

తణుకు పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలోని పాతకాలం నాటి భవనంలో రికార్డులు ఉన్నాయి. కొత్త భవనం నుంచి పాత భవనానికి విద్యుత్ సరఫరా చేసే వైర్లు సక్రమంగా లేవని, వాటిని మార్చుకోక తప్పదని ఇటీవల అధికారులు పరిశీలించి తెలిపారు. రికార్డు రూమ్‌కు విద్యుత్ సరఫరా చేసే వైర్లు సైతం ప్రమాదకరంగా ఉన్నాయని తేల్చిచెప్పారు. మొత్తానికి వైరింగ్ సరిగా లేదని ప్రమాదకరంగా ఉందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీనిపై తణుకు సబ్‌రిజిస్ట్రార్ కృష్ణంరాజు మాట్లాడుతూ రూ. 2 కోట్లు వ్యయంతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

జ్యోతికశ్రీని సత్కరించిన మాంటిస్సోరి యాజమాన్యం



జ్యోతికశ్రీని సత్కరించి, చెక్కును అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఇటీవల నిర్వహించిన ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ఇండియా తరఫున ఉమెన్ అథ్లెటిక్‌గా తమపాఠశాల పూర్వ విద్యార్థినీ డి జ్యోతిక శ్రీ పాల్గొందని తణుకు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు శనివారం తెలిపారు. జ్యోతిక శ్రీ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మాంటిస్సోరి స్కూల్‌లో విద్యను అభ్యసించిందన్నారు. ఇండియన్ ఛాంపియన్‌షిప్ అండర్ 23 తిరువనంతపురంలో 2023లో జరిగిన400 మీటర్ల 53.26 సెకన్లతో తన లక్ష్యాన్ని చేరి విజయం సాధించిందన్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని తమ పూర్వ విద్యార్థిని జ్యోతికశ్రీని మాంటిస్సోరి స్కూల్ ప్రాంగణంలో శాలువా కప్పి సత్కరించి, రూ. 25 వేలు చెక్కును బహూకరించారు. కార్యక్రమంలో జ్యోతికశ్రీ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మి, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని డాక్టర్ దినేష్ సూచించారు. మొగల్తూరు గ్రామంలోని పెద్ద గొల్లగూడెంలోని ఇళ్ల పరిసరాలను శనివారం ఆయన పరిశీలించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన 'కొట్టు'



చంద్రరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కామన చంద్రరావు మృతి చెందిన సంగతి విదితమే. ఈ సందర్భంగా శనివారం వారి కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. తొలుత చంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, మాధవరంలో కౌలు రైతు పిటక లక్ష్మణరావు, జగన్నాథపురంలో పానుకుమాటి సామ్యూల్, పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కేశిన సత్యనారాయణ, గొల్లగూడెం సెంటర్‌కు చెందిన వేగేశ్న సుభాష్ చంద్రబోస్ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాస్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, జడ్డు హరిబాబు, వెలిశెట్టి నరేంద్రకుమార్, తమ్మిశెట్టి చుక్కయ్య, తారమట్ల శ్రీనివాస్, గోపిశెట్టి దొరబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం



నినాదాలు చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ విమర్శించారు. కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారంకు నిరసనగా శనివారం స్థానిక శేషమహల్ సెంటర్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ప్రతి రెండు గంటలకు ఒక చోట మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని, మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. వైద్యులు సైతం హాస్టల్‌లో ఉండటానికి భయపడుతున్నారని, వారికి భద్రత కల్పించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.విజయ్, దుర్గా ప్రసాద్, గడ్డం రాజు, బారా చిన్నా, చంటి, ఎస్‌కే భాష, పోతురాజు, కరణం చిన్నబాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను నిలుపుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఏఎల్ నాయకులు

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సివిల్, క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాసే కొత్త చట్టాలను ఉపసంహరించుకోవాలని, ప్రజా వ్యతిరేక సెక్షన్లు తొలగించాలన్నారు. బ్రిటిష కాలం నాటి నేర చట్టాల స్థానంలో తీసుకువచ్చిన కొత్త నేర చట్టాలు ప్రజల హక్కులు హరించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, న్యాయవాదులు వైవీ ఆనంద్, పాలా రాఘవేంద్రరావు, రామకృష్ణ, వీరవల్లి బాపూజీ, సూరిబాబు, ఎల్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై తక్షణం స్పందించాలి

అత్తిలి: రెవెన్యూ సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. అత్తిలి మండలంలో సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రాల జారీ పరిశీలనపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా కుల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు సకాలంలో అందజేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి విచారణ చేసి సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రం జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంచిలి గ్రామంలో జేసీ పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రం అవసరాలను వారికి వివరించారు. ప్రజల వివరాలను పరిశీలించి సంబంధిత అధికారుల సమక్షంలో దరఖాస్తులను స్వీకరించారు.

మంచిలి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ

మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వాతావరణ మార్పులతో ప్రజలు జ్వరాల భారినపడే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి వంశీ సుబ్రహ్మణ్యేశ్వర్, మండల స్థాయి అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల కుప్పలు...వ్యాధుల వెతలు

- పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ప్రధాన ప్రాంతాల్లో కనిపించని పరిశుభ్రత
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాంగం



పెంటపాడు కొబ్బరితోటలో శుభ్రత లేక కచ్చా డ్రెయిన్‌లో అలుముకుపోయిన గడ్డి



పెంటపాడు వెలంపేటలో డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు



పెంటపాడు బీసీ కాలనీ ప్రధాన రహదారి పక్కన కుప్పలుగా చెత్త

పెంటపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లు మండలంలో ఏ గ్రామంలో చూసిన పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలు, చెత్త కుప్పలు ఎక్కువగా పేరుకుపోవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తైన చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామ వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సర్పంచ్‌లు ఏ పనిచేయాలన్నా తమకు చెప్పి చేయాల్సిందే అని అధికారులకు అధికార పార్టీ మద్దతు ఉన్న సర్పంచ్‌లకు హుకుం జారీ చేయడంతో పంచాయతీలల్లో నిధులు ఉన్న సర్పంచ్‌లు గ్రామాధికారులు ఎటు చెప్పాలో తెలియక గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శీతకన్ను వేశారు. ఒక వైపు వ్యాధుల కాలం ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గ్రామాల్లో మురుగు నీటి కాలువలలో పూడిక తీసి వాటర్ ట్యాంకులను నిర్దిత సమయానికి క్లోరినేషన్ చేయడం, బ్లీచింగ్ చల్లి గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి చెత్త పోస్టు ద్వారా ఎరువులు తయారు చేసేవారు. ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తు ఫీవర్ సర్వే చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పారిశుద్ధ్యం చర్యలు గాలికొదిలేశారు. పల్లపు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు కాలువల్లో నీరు అధికంగా చేరి చెత్త చెదారం కుళ్లిన వ్యర్థాలతో కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించడంతో దోమలు పెరిగి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో అధికారులు తూతూ మంత్రంగా మురుగునీటి కాలువల్లో పూడికలు తీసి చెత్తను వేరే ప్రాంతాలకు తరలించకుండా మళ్లీ అదే ప్రదేశంలో చెత్తను వేయకుండా నిరోధించడానికి అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకొంటారని కోరుతున్నారు.

చెత్తను తొలగించేవారు కరువు



గ్రామాలలో పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. చెత్తను సేకరించాలని చెబుతున్నా ఇంటింటికి చెత్త రిక్షాలు రావడం లేదు. గతంలో జగనన్న సీఎంగా ఉండగా స్వచ్ఛ సంకల్పం పేరుతో ఎంతో ఖర్చుతో పంచాయతీలకు రిక్షాలు అందజేశారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలి.
– దేవరశెట్టి రాంబాబు, బి. కొండేపాడు

తాగునీటిని సక్రమంగా అందజేయాలి



గ్రామాల్లో అధికారులు కనీసం తాగునీటిని కూడా సక్రమంగా అందించలేక పోతున్నారు. మంచినీటి చెరువులు కలుషితంగా మారుతున్నాయి. చెరువులలో చెత్త తీయించడంలేదు. చేపలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదు. కొళాయిల ద్వారా తాగుతున్న నీటివల్ల వ్యాధులు వస్తున్నాయి. చర్యలు తీసుకోవాలి
– దెయ్యం శ్రీనివాసరావు వల్లూరుపల్లి

సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు సేవలు



25వ వార్డు సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. శనివారం పట్టణంలోని 25వ వార్డులో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయాన్ని ఆయన కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. సచివాలయంలో పూర్తిస్థాయి సిబ్బందితో ప్రజల అవసరాలు తీర్చనున్నామన్నారు. బీజేపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు పైబోయిన రఘు, మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందచేశారు. ఎమ్మెల్యే 50 వేల రూపాయల విరాళం ఇవ్వగా, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ చలంచర్ల మురళీ, 25వేల రూపాయల విరాళాన్ని సమన్వయకర్త ఎస్‌వి.సత్యనారాయణకు అందజేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ):పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కమిటీ అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్, సంయుక్త కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాస్‌రావు, పంచాయతీ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు, కార్యదర్శి తలకాయల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాలపై సర్వే

పెనుగొండ: విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ అడ్డాల ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం పెనుగొండలో ఇంటింటా సర్వే నిర్వహించారు. దోమల నివారణ చర్యలు చేపడితే జ్వరాల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ జరిగి జ్వరాల వ్యాప్తి తగ్గుతుందన్నారు.